

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



పండుటాకులకు అండ

జీవిత చరమాంకంలో ఏ ఆసరా లేని వృద్ధులకు ప్రశాంతి వృద్ధాశ్రమం అండగా నిలుస్తోంది.

8లో

గరిష్టం/కనిష్టం
40.5°/22.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ మాధవరెడ్డి



మృతి చెందిన కానిస్టేబుల్ భార్య అశ్వినికి చెక్కు అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, విధి నిర్వహణలో మృత్యువాతపడిన పోలీసుల కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ ఎస్.వి. మాధవ రెడ్డి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున భార్య అశ్విని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఎస్పీని మాధవరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో కుటుంబ విషయాలు ఆరా తీశారు. అన్ని విధాలా ఉండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అడిషనల్ కార్పస్ ఫండ్ నుంచి మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును అశ్వినికి ఎస్పీ అందజేశారు. వీలైనంత త్వరగా మరింత ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్పీ కార్యాలయ ఏఓ సుజాత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు బ్యాంకు ఖాతా తెరవాలి



ప్రశాంతి నిలయం: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా బ్యాంక్‌లో తల్లి లేదా తండ్రితో కలిసి ఉమ్మడి ఖాతా తెరవాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి రంగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయని, మెరిట్ లిస్ట్‌ను డీఈఓ కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. www. bse.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ మెరిట్ జాబితా అందుబాటులో ఉందన్నారు. జాబితాలో పేర్లున్న విద్యార్థులు నూతన ఖాతా తెరవాలన్నారు. ఉమ్మడి ఖాతా అయినప్పటికీ విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే జత చేయాలన్నారు. అలాగే విద్యార్థి పుట్టిన తేదీ ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకంలోనూ ఒకేలా ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు.

13 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: నైరుతి కంటే ముందుగానే తొలకర్లు జిల్లాను పలకరిస్తున్నాయి. గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 13 మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 20.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కనగానపల్లిలో 16.4 మి.మీ, సీకేపల్లి 14.4, హిందూపురంలో 11.2, కొత్తచెరువులో 9.4, లేపాక్షి, పరిగి మండలాల్లో 7.6, పుట్టపర్తిలో 6.8, గోరంట్ల 5.2, రొద్దం మండలం 4.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

గ్లెన్‌బ్రిగ్స్‌కు మూడేళ్ల జైలు



అనంతపురం: గుంతకల్లు కేంద్రంగా సాగే నకిలీ విద్యా సర్టిఫికెట్ల తయారీ కేసులో ప్రధాన ముద్దాయి గ్లెన్‌బ్రిగ్స్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఓంకార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చేయకపోయినా చేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడంలో గ్లెన్ బ్రిక్స్ సిద్ధహస్తుడు. 1997 నుంచే కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు సృష్టించి సొమ్ము చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై మొత్తం 39 మందిపై 2015లో గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. నకిలీ సర్టిఫికెట్ల తయారు చేస్తున్నారని సీఐడీ విచారణ చేసి ధ్రువీకరించింది. సీఐడీ నివేదిక ఆధారంగా మేజిస్ట్రేట్ ఓంకార్ శుక్రవారం తన తీర్పు వెలువరించారు. ప్రధాన ముద్దాయి గ్లెన్‌బ్రిగ్స్‌తో పాటు మరో ఇద్దరికి మూడేళ్ల కారాగార శిక్ష, రూ.30వేల చొప్పున జరిమానా విధించారు. మరో 31 మందికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధించారు. మిగిలిన ఐదుగురు ముద్దాయిలు వివిధ కారణాలతో ఇదివరకే చనిపోయారు.

నేరేడు..లాభాల రేడు

- ఏటా రైతులకు లాభాల పంట
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- నాణ్యత ఆధారంగా నేరేడు ధరలు
- జిల్లాలో 336 ఎకరాల్లో పంట సాగు
- రొద్దం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండలో అధికం



ఓడీ చెరువు మండలం నారప్పగారిపల్లికి చెందిన మల్లప్ప అల్లనేరేడు తోట ఇది. ఆరేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద ఎకరా విస్తీర్ణంలో అల్ల నేరేడు సాగు చేశాడు. దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌లో ధర కూడా బాగా ఉండటంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభం వస్తోందని రైతు సంతోషంగా చెబుతున్నాడు.

సాక్షి, పుట్టపర్తి: ఆరోగ్యానికి మేలు చేసే అల్లనేరేడు.. రైతు ఇంట సిరులు కురిపిస్తోంది. పెట్టుబడి తక్కువ...దిగుబడి ఎక్కువగా ఉండటంతో రైతుకు లాభాలు కురిపిస్తోంది. మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతుండటంతో ఏటికేడు జిల్లాలో అల్ల నేరేడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం 336 ఎకరాల్లో అల్ల నేరేడు సాగులో ఉంది.

మూడేళ్లకే కాపు

అల్ల నేరేడుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటం, సాగుచేసిన రైతులు లాభాలు ఆర్జిస్తుండటంతో జిల్లా రైతులు కొందరు మామిడి, చీనీ తోటల మధ్యలో కొన్ని చెట్లను నాటి పండ్లను విక్రయిస్తున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండానే ఆదాయం వస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కేవలం అల్ల నేరేడు చెట్లనే సాగు చేస్తున్నారు. ఓసారి చెట్లను నాటి నీటితడులు అందిస్తే మూడేళ్లకే కాపు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఆరోగ్యం మెండు

అల్లనేరేడు పండ్లు మే, జూన్ మాసంలో విరివిగా లభిస్తాయి. వగరు, తీపి, పులుపు మేళవింపు రుచితో ఉన్న ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆకలిని పుట్టిస్తాయి. పైత్యాన్ని తగ్గిస్తాయి. విరేచనాలను నివారిస్తాయి. గుండె రక్తంలోని ఉష్ణాన్ని పోగొడతాయి. అంతేకాకుండా తినడానికి రుచిగా ఉండే అల్ల నేరేడు పండ్లను మధుమేహ బాధితులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందువల్లే అల్ల నేరేడుకు డిమాండ్ ఉంది. కిలో పండ్ల ధర ప్రాంతాలను బట్టి రూ.200 నుంచి రూ.350 వరకు ఉంటోంది. పట్టణాల్లో కిలో అల్ల నేరేడు పండ్ల ధర రూ.300 పైగా ఉంటుంది. తోటల వద్ద అయితే కిలో రూ.200కే విక్రయిస్తుంటారు. మూడేళ్ల వయసు చెట్టు సుమారుగా 30 కిలోలపైగా పండ్లను ఇస్తుంది. రూ.10 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

వ్యవసాయంపై మక్కువతో అల్లనేరేడు సాగు

ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం బెంగళూరు తదితర ప్రముఖ నగరాల్లో స్థిరపడిన జిల్లా వాసులు వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామాల్లోని తమ పొలాల్లో అల్ల నేరేడు పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు ఇద్దరు చొప్పున కూలీలను నియమించుకుని పంటకు అయ్యే ఖర్చు భరించి.. కూలి డబ్బులు చెల్లిస్తుంటారు. అదేవిధంగా కొందరు రైతులు తమ తోటల చుట్టూ కొన్ని చెట్లు నాటి ఫలాలు తీస్తున్నారు. స్థానికంగానే విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. దీంతో ఒకరిని చూసి మరొకరు అల్లనేరేడు సాగుకు సిద్ధమవుతుండగా, జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

జిల్లాలో 366 ఎకరాల్లో సాగు

అల్ల నేరేడు పంట జిల్లా వ్యాప్తంగా 366 ఎకరాల్లో సాగులో ఉంది. అత్యధికంగా కదిరి నియోజకవర్గంలో 90.5 ఎకరాల్లో పంట సాగులో ఉండగా, ఆ తర్వాత పుట్టపర్తి నియోజకవర్గంలో 84.1 ఎకరాల్లో, పెనుకొండ నియోజకవర్గంలో 66.4, హిందూపురం నియోజకవర్గంలో 36.8, ధర్మవరం నియోజకవర్గంలో 26.3, మడకశిర నియోజకవర్గంలో 23.9 ఎకరాల్లో రైతులు పంట సాగుచేశారు. అలాగే రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 11.2 ఎకరాల్లో అల్లనేరేడు పంట సాగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



చెట్లపై విరగ్గాసిన అల్ల నేరేడు పండ్లు

నాలుగేళ్లకు పంట చేతికొచ్చింది



నేను బెంగళూరులో వ్యాపారం చేస్తుంటాను. నాలుగేళ్ల క్రితం గ్రామంలో నాకున్న ఎనిమిది ఎకరాల్లో అల్ల నేరేడు పంట సాగు చేశా. ఈసారి కాపు కాసింది. చెట్లలో విపరీతంగా కాయలు ఉన్నాయి. ఎకరాకు ఖర్చు రూ.20 వేలు మించలేదు. ప్రస్తుతం కిలో ధర రూ.200 దాటినా, భారీగా ఆదాయం వస్తుంది.

– రైతు బ్రహ్మానందరెడ్డి. ఆర్.లోచెర్ల, రొద్దం

విస్తీర్ణం పెంచుతాం



అల్ల నేరేడు పంటతో రైతుకు చాలా లాభాలున్నాయి. పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువగా ఉంటుంది. దిగుబడికి అనుగుణంగా డిమాండ్ ఉంటుంది. ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఈమేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు



ఓటీపీఆర్ఐ బ్లాక్‌ను ప్రారంభించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డి

అనంతపురం: విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆధునీకరించిన సైన్స్‌బ్లాక్ (మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్స్, ల్యాబ్, తరగతి గదులు, సెమినార్ హాలు), ఓటీపీఆర్ఐలోని సైన్స్ బ్లాక్‌లో మూడో అంతస్తును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. బీటెక్ , డిగ్రీ కోర్సుల్లోనూ ఆనర్స్ డిగ్రీ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన నూతనంగా నిర్మించిన తరగతి గదులు 7, ఒక స్టాఫ్‌రూమ్‌ను ప్రారంభించారు. ఓటీపీఆర్ఐ కళాశాలలో విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా తరగతి గదులను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్, ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.శశిధర్, యూనివర్సిటీ ఇంజినీర్ జహీర్ అస్లాం, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

- అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యం సాధించాలి
- కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం

హిందూపురం టౌన్/ చిలమత్తూరు/ లేపాక్షి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని, ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొటిపి, చిలమత్తూరు మండలంలోని టేకులోడు క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీ, లేపాక్షి మండల పరిధిలోని బిసలమానేపల్లి పంచాయతీ సమీపంలోని జగనన్న కాలనీలను సందర్శించారు. ఆయా చోట్ల ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని, బిల్లులు కూడా ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామన్నారు. లేపాక్షి లేఅవుట్‌లో 37 ఇళ్లు మంజూరు చేయగా, కేవలం 7 ఇళ్లు పూర్తయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పట్టాలు పొంది పునాదులు వేయలేని వారు వారం లోపు నిర్మాణాలు చేపట్టాలని, లేనిపక్షంలో వారి ఇళ్లను రద్దు చేసి ఇళ్లు లేని నిరుపేదలకు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దీన్ని గుర్తించి అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాల్లో పురోగతికి కృషి చేయాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్న వారికి అవసరం మేరకు రుణాలు ఇప్పించాలన్నారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఇందుకోసం అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు లక్ష్యసాధన దిశగా ప్రణాళిక ఉండాలన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో, బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు వెంటనే అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట గృహనిర్మాణశాఖ పీడీ చంద్రమౌళిరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహసీల్దార్లు హసీనాసుల్తానా, నాగరాజు, బాబు, లేపాక్షి ఎంపీడీఓ నరసింహనాయుడు ఉన్నారు.



హిందూపురం: కొటిపి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకుంటున్న కలెక్టర్

- అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు చిలమత్తూరులో జర్నలిస్టుల ఇంటి పట్టాల కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి సబ్ కలెక్టర్‌తో చర్చించారు. త్వరలోనే ఇంటి పట్టాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సిద్దయ్యా..ఇదేందయ్యా

- టీచర్‌గా ఉంటూ 'టీడీపీ' కార్యక్రమంలో పాల్గొన్న సిద్దయ్య

పెనుకొండ: శెట్టిపల్లికి చెందిన దూదేకుల సిద్దయ్య మాజీ ఎమ్మెల్యే బీకే. పార్థసారథి ప్రధాన అనుచరుడు. పెనుకొండ టీడీపీ మండల కన్వీనర్‌గా ఉండేవాడు. కర్ణాటక మద్యం తరలిస్తూ అప్పట్లో పోలీసులకు పట్టుబడ్డాడు. రిమాండ్‌కు సైతం వెళ్లి వచ్చాడు. అయితే గతంలోనే బీఎడ్ పూర్తి చేసిన సిద్దయ్య 1998 డీఎస్సీలో అర్హత సాధించగా...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం మేరకు ఇటీవల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన రొద్దం మండలంలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నప్పుడు రాజకీయ పార్టీల కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సిన ఆయన... శుక్రవారం పెనుకొండలో జరిగిన 'భవిష్యత్‌కు టీడీపీ భరోసా' కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య నేతలతో కలిసి ఫొటోలు తీసుకుంటూ సంబరపడిపోయారు. సిద్దయ్య హడావుడి చూసిన టీడీపీ నేతలు ఇతను టీడీపీ సిద్దయ్యా.. టీచర్ సిద్దయ్యా అని చర్చించుకున్నారు.



టీడీపీ నాయకులతో సిద్దయ్య (వృత్తంలో)

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం





స్కిల్ హబ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జాబ్ మేళాలో పాల్గొన్న యువత

- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- జాబ్‌మేళాలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్
- ఉద్యోగాలకు 205 మంది ఎంపిక

హిందూపురం టౌన్: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీతో పాటు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ, యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసిందన్నారు. వీటి ద్వారా ఇప్పటికే వేలాదిమంది ఉద్యోగాలు దక్కాయన్నారు. పరిశ్రమల అవసరాలు తగ్గట్టుగా స్కిల్ హబ్‌ల్లో నూతన కోర్సులు ప్రవేశపెట్టారని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు సైతం కల్పిస్తున్నారన్నారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు సర్టిఫికెట్లు పట్టుకుని కంపెనీల చుట్టూ తిరిగేవారని, జగనన్న ప్రభుత్వంలో కంపెనీలే యువత వద్దకు వస్తున్నాయన్నారు. ప్రతి నెలా ఒక నియోజకవర్గంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

205 మంది ఉద్యోగాలకు ఎంపిక

మెగా జాబ్‌మేళాలో పాల్గొన్న 14 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 205 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జూలైలో మరో నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహిస్తామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. అనంతరం స్కిల్ హబ్ సెంటర్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, యువత పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతిసారం నియంత్రణపై అవగాహన



నీటితొట్టెలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: అతిసారం నియంత్రణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండలం కప్పలబండలో వైద్యాధికారి నాగరాజునాయక్, సిబ్బందితో కలిసి పర్యటించారు. మొదట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అతిసార వ్యాధి లక్షణాలు ఏవిధంగా ఉంటాయి? చికిత్స విధానాన్ని వివరించారు. ఓఆర్‌ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యాన్ని వివరించారు. అతిసార పక్షోత్సవాలను సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న పెద్దన్న, సీహెచ్‌ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మీనాయక్, రమణయ్య, సిబ్బంది అపర్ణ, ప్రమీళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం కుడికాలువకు నీటి విడుదల



కూడేరు: ధర్మవరం కుడికాలువ గుండా ప్రవహిస్తున్న నీరు

కూడేరు: ధర్మవరం కుడికాలువకు ఇరువైపులా భూములున్న రైతుల విజ్ఞప్తి మేరకు కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయం నుంచి కుడి కాలువకు అధికారులు నీటిని విడుదల చేశారు. 154 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు డ్యాం జేఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలో నీటి మట్టం 3.14 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలం కావడంతో నీటి సమస్యతో పంటలు దెబ్బతింటాయని, కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని పలవురు రైతులు కోరినట్లు చెప్పారు.

పండుటాకులకు అండ

- వృద్ధులు, అనాథల సేవలో ప్రశాంతి వృద్ధాశ్రమం
- దాతల సహకారంతో చేతనైనంత సాయం
- సేవలోనే సంతృప్తి ఉందంటున్న నిర్వాహకులు



ప్రశాంతి వృద్ధాశ్రమం భవన సముదాయం



సేవలందిస్తున్న సిస్టర్

పరిగి: జీవితంలో అన్నీ సక్రమంగా జరగాలని కోరుకోవడం ప్రతి మనిషి నైజం. అయితే విధి వెక్కిరించి రోడ్డున పడి, అనురాగాలు, ఆప్యాయతలకు దూరమైన వారు ఎంతో మంది. అలాంటి వారిని అక్కున చేర్చుకొని చేరదీస్తోంది ప్రశాంతి వృద్ధాశ్రమం, సేవా మందిరం. మూడు దశాబ్దాలుగా అనేక మందికి ఆశ్రయం కల్పించడంతో పాటూ ఎంతో మంది నిరాశ్రయులను అక్కున చేర్చుకుని వారి ఆలనా పాలన చూస్తున్నారు.

విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో ..

వృద్ధాశ్రమం నిర్మించాలని నాటి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డికి ఆలోచన రావడంతో పరిగి మండలంలోని సేవా మందిరంలో అప్పటి అధికారుల, ప్రజా ప్రతినిధుల సహకారంతో భూసేకరణ చేశారు. సేకరించిన విరాళాల డబ్బుతో 1989లో ప్రశాంతి మందిరం భవన నిర్మాణానికి పునాది వేశారు. 11 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ప్రశాంతి వృద్ధాశ్రమంలో కులమతాలకు తావు లేకుండా అనాథలకు, అభాగ్యులకు సేవలందిస్తున్నారు. 1993 మార్చి 1న ప్రశాంతి వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు.

ఆశ్రమంలో 70 మంది

ప్రశాంతి వృద్ధాశ్రమంలో ప్రస్తుతం ఆడ, మగ వారితో కలిపి మొత్తం 70 మంది వరకూ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ వారే కాకుండా ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీయులు సైతం ఇక్కడ ఉన్నారు. వంద మంది సామర్థ్యం ఉన్న ఈ ఆశ్రమంలో ఉన్న వారిలో ఎక్కువ శాతం వృద్ధులే ఉండగా...వీరిలో కొందరు దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నారు. నడవలేని స్థితిలో కొందరు, మరి కొందరు చెవిటి, కంటి చూపు లేని వారు, మెంటలీ డిజార్డర్‌తో బాధపడేవారు ఉన్నారు. ప్రస్తుతం ఏడుగురు సభ్యుల ఆధ్వర్యంలో సేవ జరుగుతోంది. ఆశ్రమంలో ఎవరైనా చనిపోతే వారి బంధువులకు అప్పగిస్తారు. లేకుంటే సేవకులే అంత్యక్రియలకు తోడ్పాటునందిస్తారు.

బర్త్ డే వేడుకలకు ఇదొక వేదిక

ప్రశాంతి వృద్ధాశ్రమంలో తరచూ వివిధ వర్గాల వారు తమ జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, పండ్లు, బ్రెడ్లు, ఇతర పదార్థాలు పంచుతుంటారు. అలాగే వివాహ వార్షికోత్సవ సంబరాలు, అన్ని కార్యాలకూ ఇక్కడి వృద్ధులకు చేతనైన సహాయం చేస్తుంటారు. దీంతో పాటూ ప్రతి నెలా బియ్యం, నగదు, కూరగాయలు, ఆకుకూరలను, ఆశ్రమానికి అవసరమైన వస్తువులను దాతలు అందిస్తున్నారు.

వృద్ధులకు పింఛన్ సౌకర్యం

వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారిలో రేషన్ కార్డు, ఆధార్‌కార్డు అర్హత ఆధారంగా 22 మంది వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా పింఛన్‌ను పొందుతున్నారు. దీంతో పాటూ ప్రతి నెలా రేషన్ షాపు నుంచి బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం ఆశ్రమానికి ప్రత్యేకంగా వలంటీర్ పనిచేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులతో పాటూ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

న్యాయమూర్తి సేవలు అమోఘం

హిందూపురం కోర్టులో విధులు నిర్వహిస్తున్న సమయంలో అప్పటి జడ్జి పీ రాములు తరచూ ఇక్కడికి వచ్చేవారు. తన సొంత ఖర్చులతో తాగు నీటి ప్లాంటు, , వాషింగ్ మిషన్, రెండు గదులకు ఏసీతో పాటు ప్రాంగణంలో రోడ్లు వేయించారు. అలాగే శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ ద్వారా నీటి సమస్యను పరిష్కరించారు.

చాలా సంతోషంగా ఉంది



ఎస్‌ఐగా పని చేస్తున్నప్పుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అభాగ్యుల దీన స్థితిగతులను చూసి చలించేవాడిని. అనాథలకు, అభాగ్యులకు ఏదో చేయాలన్న ఆలోచనతోనే వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశాం. పదిహేను రోజులకోసారి ఇక్కడికి వచ్చి ఆశ్రమంలో ఉన్న వారి బాగోగులు తెలుసుకుంటుంటాను. ఇంత మందికి సేవ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
– చంద్రశేఖర్‌రెడ్డి, ఆశ్రమ వ్యవస్థాపకులు

సాయం చేయదలిస్తే...

ప్రశాంతి వృద్ధాశ్రమం స్వచ్ఛంద సేవా సంస్థగా పేరొందింది. దాతలు సహాయం చేయదలిస్తే సెల్ ఫోన్ నంబరు: 7013066109ను సంప్రదించవచ్చు.

అందరినీ పోగొట్టుకున్నా



నేపాల్‌లో ఉన్నప్పుడు ప్రమాదవశాత్తూ సర్వస్వం కోల్పోయా. తర్వాత బెంగళూరుకొచ్చి ఓ తోపుడు బండి ద్వారా బతుకుబండి లాగాను. ఉన్న తమ్ముడూ చనిపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం ప్రశాంతి వృద్ధాశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్నా. వీరే నాకు దిక్కు. – లీన్. నేపాల్ వాసి

30 ఏళ్ల నుంచి వృద్ధాశ్రమంలోనే..



నేను ఇక్కడికి వచ్చి 30 ఏళ్లయింది. నా ఏడేళ్ల వయసులో తల్లి మరణించింది. నాన్న పరిస్థితి బాగోలేకపోవడంతో తెలిసిన వాళ్లు ప్రశాంతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఇక్కడ మాకు సేవలందిస్తున్న సిస్టర్లనే దేవుళ్లుగా భావిస్తాను. – సుశీల, బెంగళూరు

సేవలోనే సంతృప్తి



దీన జనులెందరికో సేవలందిస్తున్నాం. వారి సేవలోనే ఎంతో సంతృప్తి చెందుతున్నాం. నిరాదరణ, డిజేబుల్, వృద్ధాప్యంతో ఇక్కడికొస్తుంటారు. దాతల సహకారం మరువలేనిది.
– సిస్టర్ వల్సల, వృద్ధాశ్రమ ప్రధాన సేవకురాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గుమ్మల్లకుంట క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందారు. బత్తలపల్లి పోలీసుల వివరాలు మేరకు ... గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన నారాయణస్వామి కుమారుడు జగదీష్ (21) తంబాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఇదే సమయంలో బత్తలపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను స్థానికులు 108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తాడిపత్రిలో వృద్ధుడు...

తాడిపత్రి: మండల పరిధిలోని యర్రగుంటపల్లి వద్ద తాడిపత్రి – అనంతపురం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముచ్చుకోట గ్రామానికి చెందిన బయన్న (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల మేరకు... ముచ్చుకోట నుంచి పని నిమిత్తం తాడిపత్రికి శ్రీనివాసులుకు చెందిన ఆటోలో బయన్న బయలుదేరారు. మార్గమధ్యంలో పద్మజ అనే యువతి ఆటోలో ఎక్కింది. యర్రగుంటపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ముందు వైపు విద్యుత్ స్తంభాలతో వెళుతున్న ట్రాక్టర్ ఉన్నట్టుండి రహదారిపై వెనుక వస్తున్న ఆటోను చూసుకోకుండా ట్రాక్టర్ డ్రైవర్ మణికంఠ కుడివైపునకు ట్రాక్టర్‌ను తిప్పే ప్రయత్నం చేశాడు. దీంతో వెనుకనే వస్తున్న ఆటో విద్యుత్‌స్తంభాలను బలంగా ఢీ కొంది. దీంతో ఆటో అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో బయన్న అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, పద్మజలకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశుసంవర్ధకశాఖలో బదిలీలు



అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ పరిధిలో వివిధ హోదాల్లోని పలువురు అధికారులకు శుక్రవారం డైరెక్టరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హిందూపురం పాలీ వెటర్నరీ క్లినిక్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే.రఘునాథ్‌ను విింజమూరుకు బదిలీ చేశారు. డాక్టర్ల విభాగంలో వెటర్నరీ డిస్పెన్సరీ (వీడీ స్థాయి హాస్పిటల్)లో పని చేస్తున్న డాక్టర్ పీఎస్ మృదులను హావలిగి నుంచి ఎర్రగుంట్ల వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ ఓ.మాధవిని రత్నగిరి వీడీ నుంచి పాలసముద్రం వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ ఎం.విజయలక్ష్మిని వెంకటాంపల్లి వీడీ నుంచి యాడికి వీడీకి, డాక్టర్ డీసీ ఉస్సేనీని చుక్కలూరు వీడీ నుంచి ఎస్.రాచర్ల వీడీకి, డాక్టర్ ఎం.సుబ్బారెడ్డిని యాడికి నుంచి వెంకటాంపల్లి వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ వి.జయకుమార్‌రెడ్డిని రాయాపురం నుంచి చిలమత్తూరు వీడీకి, డాక్టర్ డి.మౌలాలీ బాషాను రామగిరి నుంచి నాగసముద్రం వీడీకి బదిలీ చేశారు. జూనియర్ వెటర్నరీ విభాగంలో వై.లక్ష్మీకాంతమ్మను యు.బసవనపల్లి గ్రామీణ పశువైద్యశాల (ఆర్‌ఎల్‌యూ) నుంచి గుడ్డిగురి ఆర్‌ఎల్‌యూకు, డీఆర్ ప్రసన్నను పి.బ్యాడిగెరె ఆర్‌ఎల్‌యూ నుంచి యు.బసవనపల్లి ఆర్‌ఎల్‌యూకు, హెచ్.భాగ్యలక్ష్మిని గుడ్డిగుర్కి ఆర్‌ఎల్‌యూ నుంచి కంచిసముద్రం ఆర్‌ఎల్‌యూకు, కె.వెంకటేశ్వర్లును కంచిసముద్రం ఆర్‌ఎల్‌యూ నుంచి పి.బ్యాడిగెరె ఆర్‌ఎల్‌యూకు బదిలీ చేశారు. హిందూపురంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బి.అంజలికుమార్‌ను ఉరవకొండ డీడీ ఆఫీసుకు బదిలీ చేశారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ విభాగంలో హెచ్.ఆనందమూర్తిని రాయదుర్గం నుంచి శెట్టూరు ఏవీహెచ్‌కు, సి.మల్లికార్జునను కణేకల్లు ఏవీహెచ్ నుంచి రాయదుర్గం ఏవీహెచ్‌కు, ఆర్ రేష్మాను కర్నూలు జిల్లా బేతంచెర్ల నుంచి యల్లనూరు ఏవీహెచ్‌కు, బి.శివప్రసాద్‌ను కర్నూలు జిల్లా పందికోన నుంచి కణేకల్లు ఏవీహెచ్‌కు బదిలీ చేశారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య




మృతులు మంజునాథ్, నితిన్‌కుమార్

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లికి చెందిన మంజునాథ్ (36) అనే యువకుడు తన వ్యవసాయ పొలంలో శుక్రవారం సాయంత్రం వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని భార్య తొమ్మిదేళ్ల క్రితం భర్తను వదిలేసి పుట్టింటిలో ఉన్నట్లు గ్రామస్తులు చెప్పారు. అప్పటి నుంచి మృతుడు తన కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికితోడు అప్పులు కూడా అధికమయ్యాయన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ నాగస్వామి పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చెప్పారు.

రైలు కిందపడి యువకుడు ...

ధర్మవరం: పట్టణంలోని గుట్టకిందపల్లి సమీపాన శుక్రవారం నితిన్‌కుమార్ (19) రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని 40వవార్డు గుట్టకిందపల్లికి చెందిన పెద్దన్న, సరస్వతి దంపతుల కుమారుడు నితిన్‌కుమార్ మానసికస్థితి సరిగా లేదు. ఇందులో భాగంగానే శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


దారి దోపిడీకి యత్నం



ప్రధాన రోడ్డుకు అడ్డంగా తంతిని కట్టిన దుండగులు

రొళ్ల: రోడ్డుకు అడ్డుగా తంతి కట్టి ఒంటరిగా వెళ్తున్న వారిని దోచుకోవాలనుకున్నారు దుండగులు. అయితే వాహనదారులు వెనువెంటనే రావడంతో వారి ప్లాన్ విఫలమైంది. స్థానికుల వివరాలమేరకు.. గురువారం రాత్రి మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లి బైలాంజనేయస్వామి ఆలయం సమీపంలో గుడిబండ మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు అడ్డంగా గుర్తు తెలియని దుండగులు ముళ్ల కంచెకు ఉపయోగించే ఇనుప తంతిని కట్టారు. అయితే వాహనదారులు రోడ్డుకు అడ్డంగా కట్టిన తంతిని చూసి వెంటనే వాహనాన్ని ఆపారు. ఒకదాని వెనకాల మరోక వాహనదారులు రావడంతో దారి దోపిడీకి వచ్చిన దుండగులు పారిపోయి ఉంటారని వాహనదారులు తెలిపారు. రోడ్డులో కట్టిన కంచెను చూడలేకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుకు తంతి కట్టడం వారంలో ఇది మూడోసారని తెలిపారు. ఇంత జరుగుతున్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు విమర్శించారు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



జగనన్న లేఅవుట్‌లో పురోగతిని తెలుసుకుంటున్న డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి

బత్తలపల్లి: మండలంలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌ని అడిగి పురోగతి తెలుసుకున్నారు. జగనన్న లేఅవుట్‌లో (తహసీల్దార్ కార్యాలయ సమీపంలో) 325 మందికి ఇంటి పట్టాలను ఇచ్చామన్నారు. అందులో 47 ఇళ్లు పూర్తయ్యాయని, 12 రూఫ్ లెవల్‌లో ఉన్నాయని, 194 బేస్‌మెంట్, 72 వాటికి పునాదులు తీసుకున్నట్లు వివరించారు. ఇంత వరకు నిర్మాణాలు వేగంగా జరగకపోవడంపై డీఎస్‌ఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

సరుకులు సక్రమంగాఅందుతున్నాయా?

ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా? అని సరుకులు తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులను జిల్లా పౌరసరఫరాల అధికారి పీజీ.వంశీకృష్ణారెడ్డి అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం బత్తలపల్లిలో ఎండీయూ వాహనం ద్వారా సరుకులు పంపిణీని ఆయన పరిశీలించారు. బియ్యం, చక్కెర, బ్యాళ్లు, రాగుల నాణ్యతతో పాటు తూకాలను పరిశీలించారు.

ఎలుగుబంటి దాడి..మహిళకు గాయాలు




ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ నల్లక్క, ఎలుగు బంటి

ఆత్మకూరు: అటవీ ప్రాంతంలో ఉండాల్సిన ఓ ఎలుగుబంటి గ్రామంలోకి వచ్చేసింది. మనిషి కనబడితే వెంటబడుతూ అందరినీ ఆందోళనకు గురిచేసింది. చివరకు ఓ మహిళపై దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళితే...ఆత్మకూరు మండల పరిధిలోని బి.యాలేరు గ్రామానికి చెందిన నల్లక్క శుక్రవారం ఉదయం పొలానికి బయలుదేరింది. పొలం సమీపంలోకి చేరుకుంటుండగా, అక్కడే చెట్ల పొదల్లో మాటువేసిన ఎలుగుబంటి ఆమెపై దాడి చేసింది. దీంతో నల్లక్క పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కన ఉన్న వారు వెంటనే స్పందించారు. దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో నల్లక్క కుడికన్నుకు గాయం కాగా, వెంటనే అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స చేయించారు.

వలలు వేసి పట్టుకుని...అధికారులకు అప్పగింత

నల్లక్కపై ఎలుగు దాడి చేయడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. పెద్దపెద్ద వలలు తెప్పించి ఎలుగుబంటిని బంధించేందుకు పొలాలను గాలించారు. మధ్యాహ్నం వరకూ శ్రమించి ఎలుగుబంటిని బంధించారు. పోలీసు సిబ్బంది సమక్షంలో దాన్ని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

వార్డెన్లు స్థానికంగా ఉండాల్సిందే


- వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి
- సంక్షేమ శాఖ అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల వార్డెన్లు అందరూ స్థానికంగా ఉండాల్సిందేనని కలెక్టర్ అరుణ్‌బాబు తేల్చిచెప్పారు. వసతి గృహ అధికారులంతా తమ చిరునామాల జాబితాలను తనకు, ఆయా జిల్లా అధికారులకు అందజేయాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వసతి గృహ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 56 బీసీ, 26 ఎస్సీ, 9 ఎస్టీ వసతి గృహాలున్నాయని, ఆయా వసతి గృహాల్లో ఇప్పటికే 7,435 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈనెల 12న పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. విధి నిర్వహణ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ఎక్కడైనా సమస్యలున్నట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు వంద శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాబోధనపై దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. అలాగే హాస్టళ్లలో విష పురుగులు రాకుండా చూడాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త అడ్మిషన్ల ప్రక్రియలో అర్హులందరికీ ప్రవేశాలు కల్పించాలన్నారు. తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మెస్, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా, పరిసరాల్లో ముళ్ల కంపలు, పొదలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది తరచూ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రాం, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 'బాలవికాస్' స్నాతకోత్సవం



పూర్వ విద్యార్థులు రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాలవికాస్ పూర్వ విద్యార్థుల 13వ స్నాతకోత్సవం, 10వ ఆశీర్వాద సమావేశం ప్రశాంతి నిలయంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత సత్యసాయి బాలవికాస్ 6 దశాబ్దాల చరిత్రలో సాధించిన ప్రగతిని డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల జాతీయ మహిళా కోఆర్డినేటర్ కమలా పాండ్య మాట్లాడారు. సత్యసాయి ప్రతి ఒక్కరికీ బాల్యం నుంచే మంచి గుణాలు, వ్యక్తిత్వం, విద్యా బుద్ధులు నేర్పేందుకే 1969 బాలవిహార్‌ను స్థాపించారన్నారు. దాన్ని క్రమంగా బాలవికాస్‌గా మార్చారన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా 15 వేల కేంద్రాలలో 18 వేల మంది గురువుల ఆధ్వర్యంలో 3.5 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. ఇది సత్యసాయి ఆశీర్వాదంతోనే సాధ్యమైందన్నారు. 2025 నాటికి ప్రతి 20 మంది విద్యార్థులకు ఇద్దరు గురువులు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి సేవా సంస్థల దేశీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య బాలవికాస్ పూర్వ విద్యార్థుల అనుభవాలను వివరిస్తూ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తర్వాత విభిన్న రంగాలలో ప్రత్యేకతను చాటుకున్న పలువురు పూర్వ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



బాలవికాస్ చిన్నారుల నృత్య ప్రదర్శన